కవర్ స్టోరీ

# ప్రేమ కథలు!




ప్రపంచం అణువులతోనో,
పరమాణువులతోనో నిర్మితం కాలేదు.
కథలు, ఉప కథలు, అనుబంధ కథలతో ప్రాణం పోసుకుంది.
నిజమే, ప్రతి మనిషికీ ఓ కథ ఉంటుంది.
ప్రతి కథలో అతను తనను తాను వెతుక్కుంటాడు.
ఇక ప్రేమికులకైతే జీవితమే ఓ ప్రేమకథా ప్రయాణం.
తొలి పరిచయం ఓ కథ. మలి భేటీ ఒక కథ.
కలిసి తాగిన ఫిల్టర్ కాఫీ ఓ కథ.
పక్కపక్కన కూర్చుని చూసిన హారర్ మూవీ ఒక కథ.
గోడ దూకి లాంగ్‌డ్రైవ్ వెళ్లిన జ్ఞాపకమూ ఒక కథే.
పెద్దల్ని ఒప్పించడం.. కాదంటే ఎదిరించడం, లేదంటే
లేచిపోవడం, పస్తులే పరమాన్నంగా బతికేయడం,
ఇరుకిరుకు గదినే ఇంద్రభవనంలా ఊహించుకోవడం..
పైకప్పు చిల్లుల్లోంచి చుక్కల్ని లెక్కబెట్టడం, జోరువానలో
వడగళ్లు ఏరుకోవడం, వణికించే చలిలో ఐస్‌క్రీమ్
చప్పరించడం.. తొలి శుభవార్తకు పరవశించి పండుగ
చేసుకోవడం.. మొత్తానికి, అచ్చంగా తెలుగు సినిమా క్లైమాక్స్
లానే అమ్మానాన్నలూ - అత్తామామలూ.. ఎర్రబస్సు దిగొచ్చి
కస్సున అరిచేయడం. అంతలోనే, మనసు మార్చుకుని 'ఒకరు
కాదు.. ఇద్దరు కావాల్సిందే. ఒక మనవడు. ఒక మనవరాలు'
అంటూ జోకేసి.. కేకు తినిపించడం. రెండున్నర గంటల సినిమా
కైతే చివర్లో 'శుభం' పడుతుంది. కానీ, ఇది జీవితం!
ఆరు పదుల్లోనూ ఆ ఇద్దరూ ప్రేమపక్షులే. ఎన్ని ఘట్టాలు,
ఎన్ని ఉద్వేగాలు, ఎంత ఉత్కంఠ. ఎన్ని కన్నీళ్లు, ఎన్ని
ఆనందబాష్పాలు. ఆ తర్వాత ఎప్పుడో.. ఏ వాలెంటైన్స్ డే నాడో..
ఏకాంతంలో ఆ కథలన్నీ నెమరేసుకుంటే.. పారేసుకున్న బ్లాక్
అండ్ వైట్ ఫొటోగ్రాఫ్ మళ్లీ దొరికినంత ఆనందం!

వారం వారం 'బతుకమ్మ'లో ప్రచురితమయ్యే చిట్టికథల్లోంచి.. ఏర్చికూర్చిన ప్రేమ కథల సమాహారం ఇది. మీరు చదవండి. మీకు ఇష్టమైనవారితో చదివించండి. ప్రేమలోక పౌరులతో షేర్ చేసుకోండి. సోషల్ మీడియా అకౌంట్‌లో స్టేటస్‌గా పెట్టుకోండి. ఎందుకంటే.. ఇవన్నీ మీ కథలే. నాయికానాయకులూ మీరే. ఇప్పటికే పీకల్లోతు ప్రేమలో ఉంటే.. ఆ బంధం ఇంకొంత బలపడుతుంది. 'సింగిల్. రెడీ టు మింగిల్' బ్యాచ్ అయితే.. త్వరలోనే అన్వేషణ ఫలిస్తుంది. హ్యాపీ వాలెంటైన్స్ డే!